క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా శుక్రవారం మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని పూడూర్ గ్రామ పరిధిలోని అన్ని ఫీడర్లకు, పరిశ్రమలకు, అగ్రికల్చర్, డొమెస్టిక్, పారిశ్రామిక సర్వీసులకు ఉ.10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

మంత్రికి ఆహ్వానం



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్‌లో ఈ నెల 12న అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలకు రావాల్సిందిగా మంత్రి మల్లారెడ్డిని కొండాపూర్ వాసులు ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రి కార్యాలయంలో ఆయన్ను గురువారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనురెడ్డి, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు



ఘట్‌కేసర్: అవుషాపూర్ వీబీఐటీ కళాశాల వాలీబాల్ క్రీడాకారులను ఆ కళాశాల చైర్మన్ గౌతంరావు, కార్యదర్శి మనోహర్‌రెడ్డి గురువారం అభినందించారు. బిట్స్ పిలాని క్యాంపస్‌లో జరిగిన క్రీడల్లో వాలీబాల్ విభాగంలో వీబీఐటీ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు షీల్డ్, స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన

కీసర: మండల కేంద్రమైన కీసరలో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల వద్ద సాగు చేసిన వరి పంటలను గురువారం కీసర వ్యవసాయాధికారి మాధవీలత పరిశీలించారు. వరి పంటలో ప్రస్తుతం వస్తున్న చీడ పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె రైతులకు వివరించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు వరిపంటకు ఎరువులు, మందుల పిచికారీ చేయాలన్నారు. రైతులు తంగళ్లపల్లి వెంకటేష్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

'అవినీతిని సహించేది లేదు'



ఘట్‌కేసర్: గ్రామంలో అవినీతిని సహించేది లేదని సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ అన్నారు. కొర్రెముల్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో నకిలీ హెచ్ఎండీఏ ఎల్ఆర్ఎస్‌లు సమర్పించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని హెచ్ఎండీఏ కార్యాలయానికి లేఖ రాశామన్నారు. పెండింగ్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉప సర్పంచ్ రాజు ముదిరాజ్, కార్యదర్శి కవిత, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెండింగ్ ఉపకార వేతన బకాయిలు విడుదల చేయాలి



ఘట్‌కేసర్: విద్యార్థుల పెండింగ్ ఉపకార వేతన బకాయిలు విడుదల చేయాలని ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు శివాజీనాయక్ డిమాండ్ చేశాడు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో వినయ్‌కుమార్, ప్రసాద్, రాకేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు



జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్.395లో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను గురువారం రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకునే వారు లేక..
ప్రభుత్వ భూముల దందా!

- రాత్రికి రాత్రే వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు
- బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ కేంద్రంగా సాగుతున్న వైనం
- పురపాలికలు, జీపీల్లోనూ జోరుగా అక్రమ కట్టడాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న సంబంధిత శాఖల అధికారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో సర్కారు, అసైన్డ్ భూముల ఆక్రమణ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతుండగా.. మరో పక్క పురపాలక సంఘాలు, పంచాయతీల్లో బహుళ అంతస్తు భవనాల అక్రమ కట్టడాలు కూడా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నవ్విపోదురు కాక.. నాకేంటి సిగ్గు అన్నట్లుగా ప్రభుత్వ భూముల ఆక్రమణలు, భవనాల నిర్మాణాలను అరికట్టాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధుల్లోని కొందరు దళారుల అవతారమెత్తి వాటిని విక్రయిస్తూ.. కోట్లకు పడగెత్తుతున్నారు. రాజకీయ పలుకుబడి, అర్థ, అంగ బలం ఉన్న పెద్దలు కూడా వారికి అండదండగా ఉండటంతో గజాలు కాదు.. ఏకంగా గుంటల కొద్దీ భూములను ఆక్రమిస్తున్నారు. ఈ దందా సంబంధిత అధికారులకు తెలిసినా.. పట్టించుకున్న దాఖలు లేవు.

భూ ఆక్రమణలు.. మచ్చుకు..

- పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ సర్వే నంబర్ 199లోని ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తు భవనాలు వెలుస్తున్నా రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ సర్వే నంబర్‌లో దాదాపు మూడెకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రికి రాత్రే ఇక్కడ ఒకటి, రెండు గదులతో ఇళ్లు నిర్మించి రూ.3లక్షల నుంచి రూ.10లక్షల వరకు కొందరు మధ్య దళారులు ప్రజాప్రతినిధులు, పలువురు ఉద్యోగుల సాయంతో విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- జవహర్‌నగర్‌లోని సర్వే నంబర్లు.137, 377, 583, 586, 598, 647లలోని దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూముల్లో నకిలీ లేఅవుట్లు సృష్టించి.. ఒక్కో ప్లాట్‌ను రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు భూ కబ్జాదారులు విక్రయిస్తున్నారు. పలువురు కార్పొరేటర్లు, నేతలు కీలకంగా వ్యవహరిస్తుండగా.. ఓ ప్రజాప్రతినిధి వారికి గుట్టుగా సహకరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.
- బోడుప్పల్‌లోని సర్వే నంబర్ 63/29లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా.. దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి ఆక్రమణకు గురవుతోంది. మున్సిపల్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చెందిన బోడుప్పల్ జీపీగా ఉన్న కాలంలో ఓ భూకబ్జాదారుడు 220 గజాల నుంచి 440 గజాల చొప్పున నకిలీ లేఅవుట్ సృష్టించి ఒక్కో ప్లాట్‌ను రూ.50 వేల నుంచి రూ.లక్షకు విక్రయించారు. ప్రస్తుతం ఇదే స్థలాన్ని కొందరు రాజకీయ నాయకులు భూకబ్జాదారుల అవతారమెత్తి 60 గజాల నుంచి 80 గజాల ప్లాట్లు ఉండేలా కొత్త లేఅవుట్ సృష్టించి.. ఒక్కో ప్లాట్‌ను గజానికి రూ.10 వేల చొప్పున అమ్ముతూ.. లక్షలు గడిస్తున్నారు. దీనికి గానూ రెవెన్యూ, మున్సిపల్‌లోని పలువురు ఉద్యోగులు మొదలుకొని స్థానిక ఉన్నత స్థాయి అధికారి వరకు ఒక్కో ప్లాట్‌కు రూ.25 వేల నుంచి రూ.లక్ష ముట్టజెప్పుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.
- నాగారంలోని సర్వే నంబర్.297లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నా.. రెవెన్యూ శాఖలో చలనం లేదు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఐదెకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు కూడా కబ్జాకు గురయ్యాయి.



బోడుప్పల్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు



పీర్జాదిగూడలో అనుమతులు లేకుండా నిర్మితమవుతున్న బహుళ అంతస్తుల భవనం

- శామీర్‌పేట్‌లో రియల్టర్లు తమకున్న 45 ఎకరాల భూమికి పక్కన 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి వెంచరు చేసినా స్థానిక రెవెన్యూ అధికారుల్లో చలనం లేదని తెలుస్తోంది.

అనుమతులు లేకుండా నిర్మాణాలు..

- ఎంసీపల్లి మండలం లింగాపూర్ తండా పరిధిలోని రెండున్నర ఎకరాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఫామ్ ల్యాండ్ పేరుతో వెంచర్ చేసి ఒక్కో విల్లాను రూ.60 లక్షల నుంచి రూ.75 లక్షలకు విక్రయిస్తున్నా.. జిల్లా పంచాయతీ శాఖ పట్టించుకోవడం లేదు.
- కొర్రెముల పంచాయతీలో అక్రమ నిర్మాణాలు, వెంచర్లు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. అంకుషాపూర్‌లో ఓ రియల్టర్ రెండు కాలువలను ఆక్రమించి 30 ఎకరాల్లో వెంచర్ చేసి ప్లాట్లను విక్రయిస్తున్నా.. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ శాఖలు గుడ్లప్పగించి చూస్తోంది తప్ప.. చర్యలు తీసుకోవడం లేదు. ఈ రెండు జీపీలతో పాటు పక్కనున్న ఎదులాబాద్, చౌదరిగూడ, కాచివాని సింగారం, ప్రతాపసింగారంలో కూడా యథేచ్ఛగా బహుళ అంతస్తులు అక్రమ భవన భవనాలు వెలుస్తున్నా.. సంబంధిత అధికారులు, సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.
- జవహర్‌నగర్‌లో ప్రతీ రోజు ఏదో ఒక డివిజన్‌లో అక్రమ కట్టడాలు వెలుస్తున్నా.. పర్సంటేజీల రూపేంలో డబ్బులు పంచుకోవడం మినహాయించి, అడ్డుకట్ట వేసే యోచన లేదు. జవహర్‌గర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా 100 నుంచి 200 వరకు బహుళ అంతస్తులు భవనాలు ఉంటాయని, ఇందులో ముఖ్య ప్రజాప్రతినిధులకు చెందినవి కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.



ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఊరుకునేది లేదు. వారెంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములకు రక్షణ కల్పిస్తాం. బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్‌తో సహ జిల్లాలో ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. అలాగే పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లోనూ ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు చేపడతాం. ఈ మేరకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)ను ఆదేశించాం.

– అమయ్‌కుమార్, కలెక్టర్

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు..
ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

కలెక్టర్ అమయ్ కుమార్



కీసరగుట్టలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అమయ్‌కుమార్

కీసర: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహా రెడ్డి, అభిషేక్ అగస్త్య, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌శర్మ, ఈఓ సుధాకర్‌రెడ్డి, కీసర సర్పంచ్ ఎస్.మాధురితో కలిసి కీసరగుట్టలో పర్యటించిన కలెక్టర్ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. జాతర జరిగే ప్రాంతమంతా కలియదిరుగుతూ వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పార్కింగ్ ప్రాంతం, క్యూలైన్లు, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపట్టిన పనులు పరిశీలించిన అనంతరం ఆలయం వద్ద జిల్లా అధికారులతో సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న కీసరగుట్టకు బ్రహ్మోత్సవాలకు నగర నలు మూలలతో పాటు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఇందు కోసం తగిన ఏర్పాట్లు కల్పించాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఈ నెల 18న మహాశివరాత్రి జాతరకు భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశమున్నందున ఆయా శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా యాత్రికుల కోసం చలువ పందిళ్లు, స్నానాలు చేసేందుకు తగు ఏర్పాట్లు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్యూలైన్లలో నిల్చునే భక్తులకు మంచినీళ్లు అందేలా చూడాలన్నారు. కీసర శానిటేషన్, వైద్యం, నిరంతరంగా విద్యుత్ సరఫరా, పార్కింగ్, ఆర్టీసీ బస్సుల సౌకర్యం, భక్తులకు త్వరితగతిన స్వామివారి దర్శనం అయ్యేలా క్యూలైన్లు ఏర్పాటు చేయడం, ప్రసాదాల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని, ఇందు కోసం ఆలయ పాలకవర్గం, అధికారులు, ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మణ్, ఎంపీటీసీ నారాయణశర్మ, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం



పాఠశాలను పరిశీలిస్తున్న సర్పంచ్ సురేందర్ ముదిరాజ్

మేడ్చల్: గౌడవెల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో అన్ని రకాలుగా వసతులు కల్పిస్తామని గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సురేందర్ ముదిరాజ్ అన్నారు. 'మన బడి–మన ఊరు' కార్యక్రమం ద్వారా చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామన్నారు.

అత్వెల్లిలో ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ



ప్రతిష్ఠ ఉత్సవాలు



పూజల్లో హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: అత్వెల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయంలో శివపార్వతులు, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. జగద్గురు హంపీ విరుపాక్ష విద్యారణ్య భారతీ స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించి పార్వతి రాజరాజేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్తన్యాసము, ధాతున్యాసము, బీజన్యాసము, యంత్ర, శిఖర, ధ్వజప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠ, కళాన్యాసము, దృక్‌బలి, దిక్ బలిహరణ, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం తదితర పూజలను జరిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, నిర్వాహకులైన కౌన్సిలర్లు సరితా మల్లేష్‌గౌడ్, మానస శ్రవణ్‌కుమార్ గుప్తా, మండల వివిధ పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం



ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న కమిషనర్ రాములు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న ఉత్తమ ఉద్యోగులను గురువారం మున్సిపల్ కమిషనర్ రాములు సత్కరించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో మున్సిపల్ ఫంక్షన్ హాల్‌లో స్వచ్ఛ సర్వేక్షన్–23లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించి ఉత్తమ ఉద్యోగులు బాలేశ్, మల్లేశ్, మంగమ్మ, మాధవిలను కమిషనర్ రాములు శాలువాతో సత్కరించి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఈఈ నర్సింహ రెడ్డి, మున్సిపల్ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ పావనీ యాదవ్, కమిషనర్ వేమనరెడ్డి



చీర్యాలలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ ఇందిర

కంటి పరీక్షలు చేయించుకోండి

ఘట్‌కేసర్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఘట్‌కేసర్ చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. మున్సిపాలిటీలోని ఆరో వార్డులో కమిషనర్ వేమనరెడ్డితో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. కౌన్సిలర్ నస్రీన్ సుల్తానా, సిరాజ్, డాక్టర్ ఫణీందర్‌రెడ్డి, పీహెచ్ఎన్ విమల, డీఈఓ సాత్విక్, వైద్య సిబ్బంది విజయ, రాజేశ్వరీ, లక్ష్మి, మేఘమాల పాల్గొన్నారు.

చీర్యాలలో...

కీసర: కంటివెలుగును ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ అన్నారు. గురువారం చీర్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ తుంగ ధర్మేందర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. అదేవిధంగా నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిలోనూ కంటివెలుగు కొనసాగుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి తెలిపారు. దమ్మాయిగూడలో 103 మందికి కంటిపరీక్షలు చేయగా 9 మందికి, నాగారంలో 107 మందిలో 49 మందికి కంటి అద్దాలు అందజేయడం జరిగిందన్నారు.

మేడ్చల్ మున్సిపాలిటీ 4వ వార్డులో...

మేడ్చల్: కంటి సమస్యల కోసం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరంలో ప్రజలంతా కంటి పరీక్షలు చేయించుకోవాలని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ గణేష్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించాలి

మేడ్చల్: బీజేపీ చేపట్టిన కార్నర్ మీటింగ్‌లను ఈ నెల 10 నుంచి 25వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పెట్టాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని సూచనలు చేశారు. శక్తి కేంద్రాలు, బూత్‌ల అధ్యక్షులు సమావేశాలను నిర్వహించి కరపత్రాలను విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పోచయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రియుడి మోజులో పడి భర్తను చంపిన భార్య

- ప్రియుడితో కలిసి మద్యంలో విషం కలిపి హతమార్చిన వైనం
- నిందితురాలు, ఆమె ప్రియుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు





నిందితులు బిజిలి బాబు, షానాబీ (మృతుడి భార్య)

ఘట్‌కేసర్: ప్రియుడి మోజులో పడి అడ్డుగా ఉన్న భర్తను తొలగించాలని ప్రియుడితో కలిసి మద్యంలో విషం కలిపి భర్తను హత్య చేసిన ఘటన ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌లో చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం... అవుషాపూర్‌కు చెందిన మౌలానా(43) మద్యంలో విషం కలుపుకుని సేవించగా చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై ఈ నెల 6న కేసు నమోదైంది. అనంతరం విచారణలో అతడి భార్య, ప్రియుడితో కలసి హత్యచేసినట్లు తేలింది. గ్రామానికి చెందిన బిజిలి బాబు(42) అలియాస్ ఎరుకల బాబు ట్రాక్టర్ డ్రైవర్. కాగా షానబీ(40) ట్రాక్టర్‌పై కూలీ పనులు చేసేది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. భర్త మౌలానా ఏడేళ్లుగా దుబాయిలో పని చేస్తూ ఇంటికి వచ్చి వెళ్తుండే వాడు. భర్త స్థానికంగా లేకపోవడంతో బాబుతో వివాహేతర సంబంధం కొనసాగించింది. కాగా పది నెలల క్రితం మౌలానా తిరిగి వచ్చి అవుషాపూర్‌లో నివాసముంటున్నాడు. షానబీ తరచూ ఫోన్‌లో ఎరుకల బాబుతో మాట్లాడటం గమనించి ఫోన్‌ను లాక్కుని వేరే ప్రాంతానికి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాడు. విషయం తెలుసుకున్న భార్య, ఆమె ప్రియుడు మౌలానాను అంతమొందించాలని పథకం పన్నారు. ఎరుకల బాబు పురుగుల మందు, మద్యం కొనుగోలు చేసి అందులో సిరంజి ద్వారా పురుగుల మందు కలిపి షానాబీకి అందజేయగా ఆమె ఇంట్లోని ఫ్రిజ్ కవర్‌లో దాచిపెట్టింది. మద్యం అలవాటున్న మౌలానా సీసాలోని మద్యం సేవించి ఆస్పత్రి పాలై మరణించాడు. బంధువుల అనుమానంతో పోలీసులు విచారణ చేపట్టి కేసును ఛేదించారు. వారి నుంచి విషం బాటిల్, ఒక ఫోన్, క్వార్టర్ మద్యం బాటిల్, సిరంజి స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలో హత్య కేసును ఛేదించిన ఘట్‌కేసర్ పోలీసులను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, డీసీపీ జానకి, ఏసీపీ నరేశ్‌రెడ్డి అభినందించారు.

ఉద్యోగ సాధనకు కుస్తీ.. గ్రంథాలయాలతో దోస్తీ

- నిరుద్యోగులకు ఉపయుక్తంగా మారిన గ్రంథాలయాలు
- ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడటంతో కిటకిటలాడుతున్న లైబ్రరీలు



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు

మేడ్చల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వెలువరించడంతో నిరుద్యోగులు ఉద్యోగ సాధనే లక్ష్యంగా సన్నద్ధమవుతున్నారు. ఆర్థిక వనరులు ఉన్నవాళ్లు ప్రైవేటు శిక్షణ కేంద్రాల వైపు పరుగులు తీస్తుండగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. దీంతో నిరుద్యోగులకు గ్రంథాలయాలు వరంగా మారాయి. ఉద్యోగ నోటిఫికేషన్ల విడుదల ద్వారా గ్రంథాలయాలకు నిరుద్యోగుల తాకిడి పెరిగింది.

నిరుద్యోగులకు ఉపయుక్తంగా గ్రంథాలయాలు...

తెలంగాణ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ద్వారా ఇటీవల గ్రూప్–1,2,4 ఉద్యోగాలతో పాటు ఇతర నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఉద్యోగాలకు భారీగా దరఖాస్తు రాగా వాటిలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్నారు. ఉద్యోగ పరీక్షల్లో విజయం సాధించేందుకు అవసరమయ్యే పుస్తకాలన్నీ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉండడంతో నిరుద్యోగులు గ్రంథాలయాలతో దోస్తీ కట్టారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రంథాలయాలకు చేరుకుని పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. స్నేహితులు, ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు జట్టుగా ఏర్పడి ప్రణాళికలు సిద్ధం చేసుకుని పరీక్షకు సన్నద్ధం అవుతున్నారు. కొత్త, పాత వంటి అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉండటం, జనరల్ నాలెడ్జ్‌కు కోసం అన్ని న్యూస్ పేపర్లు అందుబాటులో ఉంటుండటంతో నిరుద్యోగులు పెద్ద ఎత్తున లైబ్రరీలకు చేరుకుని జ్ఞానాన్ని పెంచుకుంటున్నారు.

పెరిగిన పాఠకులు...

నోటిఫికేషన్లు వెలువడటంతో గ్రంథాలయాల్లో పాఠకుల సంఖ్య భారీగా పెరిగింది. మిగతా సమయాల్లో నిత్యం వంద మందిలోపు పాఠకులు వస్తుండగా ప్రస్తుతం నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించాలని నిత్యం గ్రంథాలయాలకు వస్తున్నారు. దీంతో నిత్యం 200లకు పైగా పాఠకులు గ్రంథాలయంకు వస్తున్నారని లైబ్రరీ సిబ్బంది తెలుపుతున్నారు.

అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంటాయనే..



నేను గ్రూప్–2 ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నా. ఉద్యోగ సాధనలో భాగంగా పరీక్షకు సన్నద్ధం అవుతున్నా. పరీక్షలో విజయం సాధించాలంటే అన్ని సబ్జెక్టులపై పట్టు ఉండాలి. అందుకు అవసరమయ్యే పుస్తకాలన్నీ కొనుగోలు చేయాలేని పరిస్థితి ఉండటంతో గ్రంథాలయంలో అన్ని పుస్తకాలు లభ్యమవుతాయని నిత్యం గ్రంథాలయానికి వచ్చి సన్నద్ధమవుతున్నా.

– రజినీకాంత్, మేడ్చల్

ప్రశాంత వాతావరణంలో చదువుకోవచ్చనే..



ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడిన నాటి నుంచి పరీక్షలకు సిద్ధం అవుతున్నా. ప్రణాళికాబద్ధంగా చదువుకుంటున్న నాకు ఇంటి వద్ద ప్రశాంతంగా చదువుకునేందుకు వీలు కలగడం లేదు. గ్రంథాలయంలో ప్రశాంత వాతావరణంలో ప్రిపేర్ అవుతున్నా.

– భార్గవి, గౌడవెల్లి

అన్ని వసతులు కల్పిస్తున్నాం..



గ్రంథాలయాలన్నింటిని ఆధునీకరించారు. ఉద్యోగ నోటిఫికేషన్లకు సిద్ధం అవుతున్న వారు పెద్ద ఎత్తున గ్రంథాలయాలకు వస్తున్నారు. వారికి అవసరమయ్యే అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచడంతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్నాం.

– దర్గా దయాకర్‌రెడ్డి, చైర్మన్, జిల్లా గ్రంథాలయాల సంస్థ